క్లుప్తంగా

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి



నరసరావుపేట ఈస్ట్: హిందూ దేవతలను కించపరిచేలా మాట్లాడుతూ, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో హిందూ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. హిందూ దేవతలను కించపరుస్తున్న వారిని శిక్షించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా మహిళా ప్రముఖ్ జె.ఎస్.రాజేశ్వరి, వెంకటేశ్వరశర్మ, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ కార్యదర్శి మిరియాల నాగప్రసాదు, బ్రాహ్మణ సంక్షేమసంఘం రాష్ట్ర నాయకుడు ముత్తనపల్లి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు, కుట్టుమిషన్ల పంపిణీ

చిలకలూరిపేట: ఒయాసిస్ సంస్థ సేవలు ఎంతో విలువైనవని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొల్లా అమర్ చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సంస్థ సభ్యులు చిత్తశుద్ధితో కృషి చేయటం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా సంస్థ సభ్యులు తమ సొంత నిధులు రూ. 6 కోట్లు వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.వైద్య శిబిరాలు, మహిళలకు కుట్టు శిక్షణ వంటి సేవా కార్యక్రమాలు సైతం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు ట్రైసైకిళ్లు, 9 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, డాక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, పండ్లు అందజేత



వినుకొండ టౌన్: మనవతా విలువలు చిన్ననాటి నుంచే పెంపొందించేందుకు, సేవా కార్యక్రమాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నామని, అందులో భాగంగానే పట్టణంలోని గుమ్మడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు తమ వంతు సహకారం అందించేందుకు శనివారం తమ పాఠశాల విద్యార్థులను ఆశ్రమానికి తీసుకురావడం జరిగిందని సెయింట్ మేరి ఎలిమెంటరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల హెచ్ఎం సిస్టర్ రాణి తెలియచేశారు. ఈ సందర్భంగా చిన్నారులు తాము దాచుకున్న కొద్దిపాటి నగదుతో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్లు, బట్టలను అందించడంపై ఆశ్రమ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్సిటీ ఖోఖో జట్టుకు విద్యార్థిని ఎంపిక



నరసరావుపేట రూరల్: అంతర విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపికై నట్టు నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరికృష్ణారావు తెలిపారు. కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న కె.శ్రీలక్ష్మి కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిలింగ్ నిర్వహించిన ఖోఖో సెలక్షన్స్‌లో వరుసగా రెండవసారి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బెంగళూరు ఏలియన్స్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలలో శ్రీలక్ష్మి జేఎన్‌టీయూకే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన శ్రీలక్ష్మిని కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్, వ్యాయామ అధ్యాపకుడు రాజేంద్రబాబు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బొల్లాపల్లి: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి శనివారం సాయంత్రం కోర్టుకు హాజరు పరిచినట్లు స్థానిక ఎస్ఐ ఎల్.సుధీర్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో శనివారం ఎస్ఐ సుధీర్‌కుమార్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. నాటుసారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన సంగు హుస్సేన్ అనే వ్యక్తి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. తెలంగాణాకు చెందిన మేళ్లచెరువు మండలం వెల్లటూరుకు చెందిన ఒక వ్యక్తి వద్ద సారా కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. హుస్సేన్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఎస్ఐ వెంట సిబ్బంది రాజేష్, ఎల్‌వీ, వెంకట్రావు, బాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

పింఛన్లు పెంచి ఇస్తున్న ఘనత సీఎం జగన్‌దే

- అర్హులైన ఏ ఒక్కరికీ పింఛన్ తొలగించలేదు
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నూతన పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పింఛన్ల సంఖ్య, నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచి ఇస్తున్నారని, గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన పింఛన్లకు, నగదుకు, ఇప్పుడు సీఎం జగన్ ఇస్తున్న పింఛన్లకు అస్సలు పోలికే లేదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వినుకొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పింఛన్ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో నూతనంగా మంజూరైన 146 పింఛన్లను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పింఛన్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ నేత జీవీ ఆంజనేయులు 2019వరకు పట్టణంలో 3,592 మందికి కేవలం రూ.42,18,500లు పింఛన్ రూపంలో పంపిణీ చేస్తే, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 5,281 మంది లబ్ధిదారులకు రూ.1,48,05,750లను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నామన్న విషయాన్ని గ్రహించాలన్నారు. గతంలో మీరు ఇచ్చిన దానికంటే ఎక్కువగా ఇస్తున్నామని, ఈ వ్యత్యాసం జీవీకి కనపడకపోతే కళ్ల పరీక్ష చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. నవరత్నాలతో ఈ ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాలకు చేరువైందన్నారు. టీడీపీ హయాంలో లాగా జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు నమోదు చేసుకునే పరిస్థితి ఇప్పుడు లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా పింఛన్ మంజూరు చేయాలన్నా, అనర్హులను తొలగించాలన్నా పూర్తి పారదర్శక విధానాన్ని పాటిస్తోందని అన్నారు. పట్టణానికి తాగునీరు అందించే సింగరచెరువును 270 ఎకరాలుగా రూ.70లక్షలతో విస్తరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచడం జరిగిందని, దీంతో రోజు మార్చి రోజు తాగునీరు అందిస్తున్నామన్నారు. గుంటి ఆంజనేయస్వామి గుడి దగ్గరలో 11లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను రూ.2.55కోట్లతో నిర్మించామని, రూ.70లక్షలతో పంపింగ్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే పట్టణంలోని నిరుపేదలందరికి సొంతింటి కల నెరవేర్చేందుకు 120 ఎకరాల్లో సుమారు 5వేల జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి వారికి ఇళ్లుకట్టి ఇవ్వడం కోసం ప్రయత్నాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని వినుకొండను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ఏనుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో 104 ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ అచ్యుత రామరాజు ఓపీని చూసి అవసరమైన వారికి మందులను అందజేశారు. అలాగే వైద్య సిబ్బందితో కలిసి ఇంటి వద్దకే వెళ్లి ప్రతి రోగికి వైద్యపరీక్షలు చేశారు. గ్రామంలో హైరిస్క్ గర్భిణిని గుర్తించి పరీక్షించిన అనంతరం అత్యవసరం వైద్యం కోసం హైయ్యర్ సెంటర్‌కు రిఫర్ చేయడం జరిగిందని డాక్టర్ రామరాజు తెలిపారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, 104 డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎంవీ రాఘవకుమార్‌లు 104, పీహెచ్‌సీ వైద్యబృందాన్ని అభినందించారు. డివిజనల్ మేనేజర్ వి.విజయ్‌కుమార్, డీఈఓ సీహెచ్ కృష్ణవాసు, పైలెట్ శిఖా ఐజాక్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో శనివారం రాత్రి రెండవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ పదముత్తం, సర్పంచి దాసరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ ముండ్లమూరి సేతు, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తోట ప్రసాదు, మీసాల ఆదినారాయణ, మురికిపూడి ఏసురత్నం, గాలం గురుస్వాములు, చింగూరి ఎర్రయ్య, జొన్నలగడ్డ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పేద ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకే ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల పిల్లలు చదువుకుంటేనే ఆర్థికంగా ఎదుగుతారని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, విద్యాపరంగా అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ప్రవేశపెట్టి పేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు బైజూస్ ట్యాబ్‌లను అందించినట్లు చెప్పారు. అంబేడ్కర్ నగర్‌లో కాలనీవాసుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు లేని వీధిలో వెంటనే స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు, మున్సిపల్ స్టేడియం, ఎన్ఎస్పీ కెనాల్స్‌పై సీసీరోడ్డు, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం, కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణంతోపాటు పట్టణంలో ఎటు చూసినా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలకు 5400 ఇళ్లు జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వినుకొండకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేవిధంగా తీర్చిదిద్దుతామని, 24 గంటలూ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పట్టణంలో తాగునీటి ట్యాంకులు, నూతన పైపులైను నిర్మాణం చేపట్టినట్లుచెప్పారు. కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి మాట సత్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, 30వ వార్డు కౌన్సిలర్ షకీలా, పార్టీ పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, పార్టీ నాయకులు నరాలశెట్టి శ్రీనివాసరావు, యారం రామిరెడ్డి, కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, పులిపాటి రామారావు, మూర్తి, రెడ్డి నగేష్, వార్డు వలంటీర్లు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.11.6కోట్ల జలజీవన్ నిధులు మంజూరు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.సురేష్

బొల్లాపల్లి: ఇంటింటికి కుళాయి పథకంలో భాగంగా 53 గ్రామాలకు నిధులు మంజూరయ్యాయని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ పి.సురేష్ తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని 53 గ్రామాలకు రూ.11.6కోట్లు నిధులు మంజూరయ్యాయని, 17 సచివాలయాల పరిధిలో 53 గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండలంలోని బీఎల్‌కాలనీ, రేమిడిచర్ల, పలుకూరు, గండిగనుమల, నాయుడు పాలెం, వీరప్పకుంటతండా, నెహ్రూనగర్‌తండా, ఎంఎస్‌కే తండా, సంగినీడుపాలెం, మూడుతూముల తండా తదితర గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. మిగిలిన గ్రామాల్లో పనులు చేపట్టి త్వరలో పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా సీసీ డ్రెయిన్‌లు మండలంలోని 35 గ్రామాలకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఒక్కొక్క గ్రామానికి రూ.5లక్షల వంతున సైడ్‌కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు, ప్రస్తుతం 12 గ్రామాల్లో పూర్తయ్యాయని తెలిపారు. 35 గ్రామాలకుగాను రూ.1.75కోట్లు నిధులు మంజూరైనట్లు వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా పనులు పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తెలిపారు.

ఆయిల్ ఇంజిన్ల మాయంపై ఆందోళన



యడ్లపాడులో పైపులు, బోల్టుల్ని కోసి బెడ్‌ను వదిలి ఇంజిన్‌ను తీసుకెళ్లిన దుండగులు

యడ్లపాడు: ఆయిల్ ఇంజిన్లపై దుండగుల కన్నుపడింది. రాత్రికి రాత్రే పొలాలకు నీటి తడుల కోసం ఉంచిన ఇంజిన్లు మాయం అవుతున్నాయి. నెల రోజులు వ్యవధిలోనే మండలంలో రెండు ఆయిల్ ఇంజిన్లు అపహరణకు గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బాధితుల నుంచి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. గతనెల 13వ తేదీ రాత్రి యడ్లపాడు-కారుచోల గ్రామాల మధ్య కొండవీటి మేజర్ కాలువ కట్టపై ఉన్న మోహన్‌రావుకు చెందిన రూ.40వేల విలువైన ఆయిల్ ఇంజిన్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో నీటిపైపులు, ఫుట్‌బాల్ కోసి బెడ్ నుంచి వేరు చేసి ఇంజిన్‌ను తీసుకెళ్లారు. దీంతో రైతు ఇంజిన్ బెడ్‌ను ఊడదీసి పక్కనే ఉన్న ఓ చెట్టుకింద ఉంచగా అది కూడా చోరీ అవ్వడంతో ఏం చేయాలో అర్థం కాక లబోదిబో మంటున్నారు. ఈ విషయం మరువక ముందే తాజాగా అదే తరహాలో శుక్రవారం రాత్రి మరోరైతు పొలం తడులకు ఉంచి ఇంజిన్ చోరీ కావడంతో గ్రామంలోని రైతులు ఉలిక్కిపడ్డారు. స్థానిక ఎస్సీకాలనీకు చెందిన డేగల పేతురు యడ్లపాడు-కారుచోల వెళ్లే మార్గంలోని నారాయణ చెరువు వద్ద మిరప తోటకు నీరు పెట్టుకునే నిమిత్తం 15 రోజుల కిందట ఆయిల్ ఇంజిన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి 10 గంటల వరకు పొలం వద్ద ఉండి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం మందు కట్టలను తీసుకుని చేను వద్దకెళ్లి చూసుకోగా ఇంజిన్ కనిపించలేదు. గతంలో జరిగిన చోరీ మాదిరిగానే పైపులను, బెడ్‌కు ఇంజిన్‌కు ఉండే బోల్టులను కోసి ఇంజిన్‌ను మాత్రమే తీసుకెళ్లినట్లు తెలిపాడు. చోరీ జరిగే ముందు రెండురోజులు ఆరెకరాల మిరప తోటకు నీటి తడులు అందిస్తున్నామని రాత్రికి రాత్రే మాయం కావడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో ఇంజన్‌ను రూ.40 వేలకు కొనుగోలు చేశానని, ప్రస్తుతం మార్కెట్‌లో దాని ధర రూ.50 వేలు ఉందని చెప్పారు. చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు. వరుసగా జరుగుతున్న ఆయిల్ ఇంజిన్ల చోరీ ఘటనలతో మండల రైతులు బెంబేలెత్తుతున్నారు.

చీరాల ఓడరేవు హైవే మార్గాన్ని మార్చండి

జిల్లా కలెక్టర్‌కు రైతుల వినతి



జిల్లా కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

నరసరావుపేట: నియోజకవర్గంలోని పలు గ్రామాల మీదుగా నిర్మించనున్న చీరాల ఓడరేవు (167-ఏ) హైవే మార్గాన్ని మార్చాలని పలు గ్రామాలకు చెందిన రైతులు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరారు. శనివారం కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇసప్పాలెం, గుంటగార్లపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి హైవే మార్గంపై తమ అభ్యంతరాలను తెలియచేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ హైవే మార్గ ప్రతిపాదనను మార్చాలని గత కొంతకాలంగా తాము అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నా శుక్రవారం సర్వేయర్లు సుమారు 50మంది కూలీల సహాయంతో కేసానుపల్లి, గుంటగార్లపాడు గ్రామాల్లో సర్వే రాళ్లు ఏర్పాటుచేస్తుండగా తమకు కనీసం సమాచారం తెలియచేయకుండా సర్వే చేస్తున్నందుకు తాము అభ్యంతరం వ్యక్తం చేయటంతో వారు వెళ్లిపోయారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రైతులకు తెలియకుండా ఇక ముందు ఏ పని జరగదని, హైవే ప్రతిపాదనను మార్చాలనే రైతుల కోరికను హైవే అథారిటీకి లెటర్ ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ఆ లెటర్ కాపీలను ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు రైతులకూ అందజేస్తామని కలెక్టర్ వివరించారు. దీనిపై కలెక్టర్‌కు రైతులు ధన్యవాదాలు తెలిపారు. నల్లపాటి రామారావు, నల్లపాటి సత్యనారాయణ, కొరిటాల నాగభూషణం, కట్లా సాంబశివరావు, విజయకుమార్, బాపతు ప్రభాకరరెడ్డి, కామినేని రామారావు, బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



భాస్కర్‌నగర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏపీఎం

శావల్యాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జి.వాసుబాబు కోరారు. శనివారం మండలంలోని మతుకుమల్లి, బొందిలిపాలెం తదితర గ్రామాల్లో వీవో బుక్స్ వెరిఫికేషన్ మరియు జీవనోపాధి రుణాలు, జగనన్న తోడు తదితర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా క్షేత్రస్థాయిలో వీవోఏలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతినెలా గ్రూపు సభ్యుల సమావేశాలు, పుస్తకాల నిర్వహణ, బ్యాంక్ రుణాల చెల్లింపులపై మహిళాసభ్యులకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామసమాఖ్య సహాయకులు, యానిమేటర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. మండలంలోని గుంటుపాలెం గ్రామంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై మహిళా సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, పశువైద్యాధికారి గణేష్, సీసీలు బేబిరాణి, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

తురుమెళ్లలో...

రొంపిచర్ల: మండలంలో తురుమెళ్ల గ్రామంలో శనివారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారికి నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించారు. సమావేశంలో జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు పాల్గొని మాట్లాడారు. వీఏఓలు, డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కాలేషావలి మృతి



పఠాన్ కాలేషావలి (ఫైల్)

నాదెండ్ల: చిరుమామిళ్లలోని శ్రీ కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న పఠాన్ కాలేషావలి (56) గుండెపోటుతో శనివారం ఉదయం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం నుంచి విధులకు సెలవు పెట్టారు. శనివారం మధ్యాహ్నం చిలకలూరిపేటలోని తన స్వగృహంలో మృతి చెందారు. ఈయన గతంలో రాజుపాలెం, జంగాలపల్లె, గణపవరం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేశారు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న నాదెండ్ల ఎంఈఓ ఐ.ఆంజనేయులు, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నేతలు కాలేషావలి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

11 నుంచి వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్

రొంపిచర్ల: మండలంలో బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 14 వరకు ఛత్రపతి శివాజీ వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి కింద రు.25,116, ద్వితీయ బహుమతి రూ.20,116, తృతీయ బహుమతి రూ.15,116, నాల్గవ బహుమతి రూ.10,116 రూపాయలు, ఐదో బహుమతి రూ.8,116, ప్రత్యేక బహుమతి రూ.5,116లు నగదు ఇవ్వటం జరుగుతుందన్నారు. అదే విధంగా బెస్ట్ బ్లాకర్, బెస్ట్ లిఫ్టర్, బెస్ట్ సెంటర్ వంటి ప్రత్యేక బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 6281964568, 7794932356, 9866953950, 9912889502 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

సంగీతనాట్య కళారూపాల పోటీలు




భరతనాట్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

చిలకలూరిపేట: కనుల పండువగా శాస్త్రీయ నృత్యాలు, వీనుల విందుగా సుమధుర సంగీత కీర్తనలు, నాట్య కళాకారుల ఉత్సాహపూరితమైన ప్రదర్శనల మధ్య కళానిలయం 38వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్యకళారూపాల పోటీలు శనివారం రెండోరోజు కొనసాగాయి. పోటీలకు వేదికైన పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణమండపంలో భరతనాట్యం, కూచిపూడి పోటీలు చంద్ర, సూర్య విభాగాలలో రసవత్తరంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కాళ్లకు గజ్జెలు కట్టి, చక్కటి హావభావాలతో తమ నాట్యకళ ప్రదర్శించి నటరాజవారసులమని నిరూపించారు. ఒకవైపు పోటీలు కొనసాగిస్తూనే మరోవైపు నాట్యకళ బోధించిన నాట్యాచార్యులకు సన్మానాలు నిర్వహించి వారి ఆశీస్సులు పొందారు. ముందుగా కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి ప్రగడ శివసత్యనారాయణమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి పూజ నిర్వహించారు.

నేటికార్యక్రమాలు ....

కళానిలయం 38వ జాతీయస్థాయి నవరస శాస్త్రీ య, జానపద, సంగీత నాట్య కళారుపాల పోటీల లో భాగంగా ఆదివారం జానపద నృత్యపోటీలతో పాటు శాస్త్రీయ జంటనాట్యాలు, శాస్త్రీయం కాని జంటనాట్యాలు, బృందనాట్యాలు, నృత్యనాటికల పోటీలు సూర్య, చంద్ర విభాగాల్లో నిర్వహిస్తారు.

నేడు పెదకూరపాడు తిరునాళ్ల



విద్యుత్ కాంతులతో పెదకూరపాడు ముగ్గురు రాజుల దేవాలయం

పెదకూరపాడు : పెదకూరపాడు ముగ్గురు రాజుల తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. తిరునాళ్ల సందర్భంగా ముగ్గురు రాజుల దేవాలయం విద్యుత్ దీపాలతో విరసిల్లుతుంది. అమరావతి- సత్తెనపల్లి రహదారిపై సందడి వాతవర్ణం నెలకొంది. గత 25 సంవత్సరాలుగా వైభవంగా మహోత్సవం నిర్వహిస్తున్నారు. చుట్ట పక్కల గ్రామాలతోపాటు జిల్లాలో పలు గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని బాలయేసును సందర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా స్థానిక విచారణ గురువులు ఫాదర్ రెవరెండ్ పుట్టి సుందరరాజు మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా దివ్యపూజ బలిని గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప బిషప్ డాక్టర్ రెవరెండ్ గాలి బాలిలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కొవ్వొత్తుల కానుకల సమర్పణ, రాత్రి 9 గంటలకు బాణా సంచాలతో గ్రామ వీధుల్లో తేరు ప్రదక్షిణంచబడుతుందన్నారు. రంగుల రాట్నం, దుకాణాలు పెట్టుకునేందుకు స్థలం కేటాయించినట్లు తెలిపారు.



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | నరసరావుపేట బ్రాంచి
డి.నెం.9-9-44 టు 46, బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట, నరసరావుపేట-522601. ☎ 08647-225556

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు / సహఋణదారులు / తనఖాదారులు / హామీదారులుకు నోటీసు ద్వారా తెలియచేయునది ఏమనగా ఈ దిగువ పేర్కొనబడిన (ఋణగ్రహీతలు / సహఋణదారులు / తనఖాదారులు / హామీదారులు): (1) శ్రీ షేక్ ఖాశింవలి, తండ్రి: సుభాని, చిరునామా: డోర్ నెం.13-2-102/54, ఫస్ట్ స్ట్రీట్, మొహిద్దీన్ నగర్, రైల్వేగేట్ దగ్గర, నరసరావుపేట, గుంటూరు-522601, మొబైల్: 9985032372. (2) శ్రీమతి షేక్ షకీలా అలియాస్ షకీరా, భర్త: ఖాశింవలి, చిరునామా: డోర్ నెం.13-2-102/54, ఫస్ట్ స్ట్రీట్, మొహిద్దీన్ నగర్, రైల్వేగేట్ దగ్గర, నరసరావుపేట, గుంటూరు-522601 నుండి సెక్యూరిటీ క్రెడిటార్ అనగా పూర్వము ఆంధ్రా/కార్పొరేషన్ బ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట శాఖకు 19.11.2022 తేదీనాటికి చెల్లించవలసిన బకాయిసొమ్ము: రూ.22,57,196.92 (అక్షరాల ఇరవైరెండు లక్షల యాభైఏడు వేల నూట తొంభై ఆరు రూపాయలు మరియు తొంభై రెండు పైసలు మాత్రము) + తదుపరి వడ్డీ మరియు ఖర్చులు మొ॥నవి మొత్తమును రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ పూర్వము కార్పొరేషన్‌బ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ఇ-వేలం ప్రక్రియలో ది.25.01.2023 విక్రయించబడును.

స్థిరాస్తుల వివరములు

గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా నందు 18-06-2014 తేదీగల దస్తావేజు నెం. 4518/2014 ద్వారా శ్రీమతి షేక్ షకీరా మరియు శ్రీ షేక్ ఖాశింవలి పేరునగల ఆస్తి. గుంటూరు జిల్లా – 522601, నరసరావుపేట, మొహిద్దీన్ నగర్ ఏరియా, కాశీ రామారావు రైస్ మిల్ దగ్గర, శ్రీ కన్యకా పరమేశ్వరి రైస్ మిల్ వెనుకవైపు, చిలకలూరిపేట రోడ్డు యొక్క దక్షిణం వైపున, పాత వార్డు నెం. 2, న్యూ వార్డు నెం.14, ప్రస్తుత వార్డు నెం. 27, బ్లాక్ నెం.2/27, టి.యస్.నెం. 1574/10, ప్రస్తుత డోర్ నెం. 13-2-102/54 కలిగిన 68.32 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలము మరియు అందులో 600 చ॥అ॥ ప్లింత్ ఏరియాలోని గ్రౌండ్ ఫ్లోర్ కలిగిన ఆర్‌సిసి భవనమునకు సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: 4 అ॥ ఉమ్మడి నడక మార్గము; దక్షిణం: యస్‌కె. కరిముల్లా యొక్క ఇల్లు; పడమర: యస్‌కె. ములకలూరి సైదా యొక్క ఆస్తి; ఉత్తరం: శ్రీ కన్యకాపరమేశ్వరి మిల్ యొక్క స్థలము.

రిజర్వుధర: రూ.16,29,000/- బయానా: రూ.1,63,000/- బిడ్ పెంపుదల: రూ.17,000/-

ఇ-వేలం తేది మరియు సమయం : 25-01-2023, మ॥ 3-00 గం॥ల నుండి సా॥ 5-00 గం॥ల వరకు
(10 నిమిషాల అపరిమిత స్వీయ పొడిగింపులతో) ఇ వేలం వెబ్‌సైట్: www.mstcecommerce.com

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అందించిన వెబ్‌సైట్ లింక్ అనగా www.unionbankofindia.com నందు సంప్రదించండి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. పైన తెలిపిన ఋణంకు సంబంధించి పైన పేర్కొన్న తేదీలో ఇ-వేలం విక్రయం నిర్వహించబడునని ఋణగ్రహీతలు / హామీదారులకు తెలియజేయడమైనది.

తేది: 07-01-2023
ప్రదేశం: నరసరావుపేట
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com